RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 429 | 22 బుధవారం జూలై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## నీట్ లీకేజీ వ్యవహారం అత్యంత బాధాకరం : రఘునందన్ రావు



నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం అత్యంత బాధాకరమని, అయితే ఈ అంశంపై ఇప్పటికే సీబీఐ దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతోందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. నీట్‌తో పాటు ఏ ప్రజా సమస్యపై అయినా పార్లమెంట్‌లో సమగ్రమైన సమాధానం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. అయితే పార్లమెంట్ సమావేశాలు కేవలం నిబంధనల ప్రకారమే సాగుతాయని, విపక్షాల ఆలోచనలకు అనుగుణంగా జరగవని తేల్చిచెప్పారు. జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేసి ఫొటోలు దిగాలనే ఉద్దేశంతోనే విపక్షాలు సభను వాయిదా వేయిస్తున్నాయని ఆయన విమర్శించారు.సభా నిబంధనల ప్రకారం నీట్ అంశంపై చర్చించేందుకు స్పీకర్ అంగీకరించినప్పటికీ, జీరో అవర్‌ను రద్దు చేసి ఇప్పుడే చర్చ పెట్టాలంటూ విపక్షాలు పట్టుబట్టడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థులకు ఇప్పటికే నీట్ రీ-ఎగ్జామ్ నిర్వహించి ఫలితాలు కూడా వెల్లడించామని గుర్తుచేశారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో చట్టసభను ముట్టడిస్తామంటే ఏ ప్రభుత్వమైనా భద్రత దృష్ట్యా నిరసనకారులను అడ్డుకుంటుందని, దానిని వివాదం చేయడం సరికాదని వ్యాఖ్యానించారు.అలాగే అయోధ్య విరాళాల చోరీ ఉదంతంతో బీజేపీ లేదా ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని రఘునందన్ రావు స్పష్టం చేశారు. ఈ చోరీ కేసుపై సిట్ లోతుగా విచారణ జరుపుతోందని తెలిపారు. ఆలయంలో పనిచేసే ఒక వ్యక్తి దురాశతో చేసిన తప్పును తీసుకొచ్చి ఒక పార్టీకి ఆపాదించడం దుర్మార్గమని మండిపడ్డారు. వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికలు రాబోతున్నందునే, రాజకీయ లబ్ధి కోసం విపక్షాలు బీజేపీపై లేనిపోని ఆరోపణలు గుప్పిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్..

## - కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్



నీట్-యూజీ 2026 పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు ఆయన తన పూర్తి మద్దతు ప్రకటించారు.సోషల్ మీడియా వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు వారి గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను ప్రయోగిస్తోందని ఆరోపించారు.

“నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పడిన ప్రతి దెబ్బ.. ప్రశ్నలన్నా, నిజమన్నా బీజేపీకి ఉన్న భయాన్ని బహిర్గతం చేస్తోంది. నీట్ కుంభకోణంపై కేంద్రం ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలి. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను” అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు.పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం, కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు ‘ఛలో పార్లమెంట్’ కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో సమూల సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వారు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

## భర్తల ఉద్యోగాలు ఊడేలా భార్యల ఫిర్యాదులు : సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన



వైవాహిక వివాదాల నేపథ్యంలో కొందరు మహిళలు తమ భర్తలు పనిచేసే సంస్థలకు ఫిర్యాదులు చేస్తూ, వారి జీవనోపాధి దెబ్బతినేలా ప్రవర్తించడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి ఫిర్యాదుల వల్ల భర్తలు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అది చివరికి భార్యలకు అందే భరణం (జీవనభృతి)పై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. అసోంలో నమోదైన ఒక పరువునష్టం కేసును ఉత్తర్ ప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది.ఈ విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానిస్తూ.. “ఇటీవలి కాలంలో వివాహ సంబంధిత గొడవల వల్ల భర్తలు పనిచేసే కంపెనీలు లేదా సంస్థలకు భార్యలు ఫిర్యాదు చేయడం ఒక ధోరణిగా మారింది. విడాకులు కోరడం వేరు. కానీ జీవిత భాగస్వామి జీవనోపాధినే దెబ్బతీయడం అత్యంత తీవ్రమైన అంశం” అని అభిప్రాయపడ్డారు. ఈ కేసులో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారైన తన భర్త సేవా నియమాలకు విరుద్ధంగా వ్యక్తిగత వ్యాపారం నడుపుతున్నాడంటూ సదరు మహిళ ఎయిర్‌ఫోర్స్ అధికారులకు ఫిర్యాదు చేయగా, ఆమెపై భర్త స్నేహితుడు పరువునష్టం కేసు దాఖలు చేశారు.ఇరువైపులా వాదనలు విన్న సుప్రీంకోర్టు, ఈ వివాదంలో సామరస్యపూరిత పరిష్కారానికి అవకాశం ఉందేమో పరిశీలించేందుకు కేసును మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపింది. పరస్పర ఆరోపణలన్నీ విరమించుకుని సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని మహిళకు అత్యున్నత కోర్టు సూచించింది.

## ‘సమాధానం చెప్పాల్సింది లాఠీలతో కాదు’.. కాక్రోచ్ పార్టీ ర్యాలీకి కేటీఆర్ మద్దతు



నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. యువత ఆవేదనను పట్టించుకోకపోతే దేశంలో ‘జెన్-జెడ్’ ఉద్యమం తప్పదని తాను పదినెలల కిందటే చెప్పానని గుర్తుచేశారు. ఢిల్లీలో జరిగిన నిరసనల తర్వాతైనా కేంద్రం జవాబుదారీతనం చూపించి, విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం, బాష్పవాయు గోళాలు ప్రయోగించడాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది లాఠీలతో కాదని, రాజ్యాంగం ప్రతి పౌరుడికి ప్రశ్నించే హక్కు కల్పించిందని పేర్కొన్నారు. విభేదాల గొంతు నొక్కే ప్రయత్నాలను కేంద్రం వెంటనే ఆపాలని, జవాబుదారీతనం కోసం పోరాడుతున్న విద్యార్థులకు తాను సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు.ఇదే అంశంపై తెలంగాణ కాంగ్రెస్ కూడా సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ పాల్గొన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పొన్నం డిమాండ్ చేశారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులకు మద్దతు ప్రకటిస్తూ, పోలీసుల చర్యలను ఖండించారు.

## ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు నమ్మిన రైతులు తీవ్రంగా నష్టపోయారు : హరీశ్ రావు



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలను నమ్మి దేవాదుల ప్రాజెక్టు కింద నారుమడులు పోసుకున్న రైతులు ఇప్పుడు నీళ్లు లేక తీవ్రంగా నష్టపోయారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి మాటలు నమ్మి నాట్లు వేసుకుంటే, ఇప్పుడు నీళ్లు రాక ఆ నారుమడులన్నీ ముదిరిపోయి పుచ్చిపోయే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. దేవాదుల నుంచి 38.16 టీఎంసీల నీటిని ఎత్తిపోసి, 22 రిజర్వాయర్లను నింపి ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం డైలాగులు కొట్టిందని విమర్శించారు. అసలు ఆ నీళ్ల మంత్రికి దేవాదుల కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా తెలియదని హరీశ్ ఎద్దేవా చేశారు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వానికి నీళ్ల నిర్వహణపై కనీస అవగాహన లేదని విమర్శించారు. దేవాదుల అనేది బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టు అని, ఆ విషయం కూడా కాంగ్రెస్ నాయకులకు తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.కాళేశ్వరం విషయంలో కుంటిసాకులు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేసిన ప్రభుత్వం... మరి దేవాదుల వద్ద నీళ్లు ఎత్తడానికి ఏం అడ్డంకి వచ్చిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. తాను ప్రెస్ మీట్ పెట్టి నిలదీసిన తరవాతే మంత్రులు హెలికాప్టర్ వేసుకుని అక్కడికి పరిగెత్తారని తెలిపారు. రేపే మోటార్లు నడుపుతామని మంత్రులు ఒకరిని మించి ఒకరు ఉపన్యాసాలు దంచారని, కానీ ఎనిమిది రోజులు గడిచినా ఇప్పటికీ 10 మోటార్లు కూడా స్టార్ట్ కాలేదని ఎద్దేవా చేశారు. మంత్రులు వెళ్లిన రోజు ఏడు మోటార్లు నడిస్తే, తెల్లారేసరికి అవి ఐదుకి పడిపోయాయని, కాంగ్రెస్ మంత్రుల మాటలు కోటలు దాటుతున్నాయే తప్ప చేతల్లో శూన్యమని అన్నారు.

# మోదీ నివాసం వద్ద ధర్నా

## చేస్తున్న రాహుల్ గాంధీతో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ భేటీ

నీట్ పరీక్ష అక్రమాలు, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ చేపట్టిన నిరసన కార్యక్రమం ఆసక్తికర పరిణామాలకు వేదికైంది. లోక్ కల్యాణ్ మార్గ్లఓ ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద ధర్నా చేస్తున్న రాహుల్ గాంధీని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ కలుసుకుని కొద్దిసేపు మాట్లాడారు. నిరసన ఉద్రిక్తతల నడుమ చోటుచేసుకున్న ఈ ఘటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.వివరాల్లోకి వెళితే, నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై ప్రధాని నరేంద్ర మోదీ జవాబుదారీతనం వహించాలని, విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ మంగళవారం భారీ నిరసన కార్యక్రమం చేపట్టింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా సహా పలువురు ఎంపీలు, నాయకులు లోక్ కళ్యాణ్ మార్గ్ లోని ప్రధాని నివాసం వైపు ర్యాలీగా బయలుదేరారు.అయితే, పోలీసులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్, నేరుగా రాహుల్ గాంధీ వద్దకు వెళ్లి ఆయనతో మాట్లాడారు. వారిద్దరి మధ్య ఏం చర్చ జరిగిందనే వివరాలు వెంటనే తెలియరాలేదు. అయినప్పటికీ, ఒకవైపు నిరసన జరుగుతుండగానే ప్రభుత్వ ప్రతినిధి, ప్రతిపక్ష నేత మాట్లాడుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. వర్షాకాల సమావేశాల నేపథ్యంలో పార్లమెంటులో నీట్ అంశంపై చర్చకు విపక్షాలు పట్టుబడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కాంగ్రెస్ తమ ఆందోళనను పార్లమెంటు నుంచి వీధులకు విస్తరించింది. నీట్ వ్యవహారంలో ప్రధాని మోదీ నుంచి



సమాధానం రాబట్టే వరకు తమ పోరాటం ఆగదని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. ఈ నిరసనతో ఢిల్లీలోని కీలక ప్రాంతాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
22 బుధవారం జూలై 2026

# మునగనూర్‌లో 12 ఎకరాల ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 21:- రంగారెడ్డి జిల్లా: ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ పరిధిలోని మునగనూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 44/2, 44/4లో ఉన్న సుమారు 12 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఆరోపిస్తూ మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్. శారదా దేవికి వినతిని అందజేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.సీసీఎల్ఏ ఇప్పటికే ప్రభుత్వ భూమిగా గుర్తించిన ఈ భూమిని వెంటనే నిషేధిత జాబితాలో చేర్చి, స్థలంలో ప్రభుత్వానికి చెందిన భూమి అని స్పష్టంగా బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. అలాగే ప్రభుత్వ భూమి ఆక్రమణ అంశంపై సుమోటోగా కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.



ప్రభుత్వ భూముల రక్షణ విషయంలో అధికారులు తక్షణమే స్పందించాలని, నిర్లక్ష్యం కొనసాగితే ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని బూర నర్సయ్య గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ డివిజన్ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి, బోసుపల్లి ప్రతాప్



నారాయణ యాదవ్, కొత్త రామ్‌రెడ్డి, బచ్చిగళ్ల రమేష్, కొండ్రు పురుషోత్తం, యూసుఫ్ రెడ్డి, నోముల కార్తీక్ గౌడ్, మల్లెల ప్రేమ్‌సాయి, కోలాను రవీందర్ రెడ్డి, నందగిరి సురేష్, గుండ కృష్ణ, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూమి కాజేసేందుకు బెదిరింపులు.. రక్షణ కోరుతున్న మహిళ



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 21:- రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం రాంపురం గ్రామంలో పట్టా భూమి వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామానికి చెందిన లలిత తన పేరుపై ఉన్న సర్వే నెం.356లోని 2.14 ఎకరాల పట్టా భూమిని కొందరు అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భర్త మరణించిన తర్వాత తన కుటుంబం బలహీన పరిస్థితిని ఆసరాగా చేసుకుని భూమిపై కన్నేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాను భూమిని కాపాడుకునేందుకు ప్రయత్నించగా, గ్రామంలోని కొందరు వ్యక్తులు తనను, తన కుమారుడిని హత్య చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ బెదిరింపుల నేపథ్యంలో తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేసిన లలిత, పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించి తమకు రక్షణ కల్పించాలని, భూమిపై అక్రమ ప్రయత్నాలను అడ్డుకుని న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించినట్లు వెల్లడించారు.ఈ వ్యవహారంపై అధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

# ఎల్-నినో ప్రభావంపై అప్రమత్తం.. అన్ని శాఖలు మిషన్ మోడ్‌లో పనిచేయాలి

## రైతుల రక్షణే లక్ష్యం.. ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 21 రంగారెడ్డి జిల్లా: ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పనిచేయాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి స్పీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రతి శాఖ ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వరికి బదులుగా పెసర, కంది, జొన్న, రాగులు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించాలని సూచించారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన చోట కొత్త బోర్లు తవ్వడం, నిరంతర విద్యుత్ సరఫరా కల్పించడం, పశువులకు పశు గ్రాసం అందుబాటులో ఉంచడం, ఉపాధి హామీ పనులను వేగవంతం చేయడం వంటి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ప్రాంతాల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలను అమలు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ కార్యాచరణ ప్రణాళికలను వివరించగా, అనంతరం తెలంగాణ జలసిరి పోస్టర్లను ఆవిష్కరించారు.

# ఎస్ఐఆర్ నమోదు కార్యక్రమానికి బజరంగ్ సేన మద్దతు




హైదరాబాద్, జూలై 21: బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణరావు, తమ సంస్థ బృంద సభ్యులతో కలిసి మంగళవారం బేగం బజార్ వార్డు కార్యాలయంలో జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నమోదు కార్యక్రమంలో పాల్గొని, తమ మద్దతును అందించారు. ఈ బృందం స్థానిక నివాసితులు మరియు అధికారులతో మమేకమై, అర్హులైన పౌరులు తమ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ప్రోత్సహించింది. అలాగే ఈ కార్యక్రమంలో పౌర భాగస్వామ్యం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. ఈ సందర్భంగా ఎన్.ఆర్. లక్ష్మణరావు మాట్లాడుతూ.. కొనసాగుతున్న సర్ కార్యక్రమానికి ప్రజలు చురుకుగా సహకరించాలని, వారి వివరాలు సరిగ్గా నమోదు అయ్యేలా చూసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం అంతటా బజరంగ్ సేన తెలంగాణ సభ్యులు అక్కడే ఉండి, ప్రజలలో అవగాహన కల్పించడంలో సహాయపడ్డారు. అలాగే ఈ ప్రాంతంలో పౌర మరియు పరిపాలనా కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడంలో తమ సంస్థ యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించారు.

# జనగణన--2027లో యూనిక్ నేషనల్ కాస్ట్ కోడ్ లేకుంటే మరోసారి బీసీలకు అన్యాయం జరిగే ప్రమాదం

- ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించినప్పుడే శాస్త్రీయ కులగణన సాధ్యం
- ప్రధాని మోదీ తక్షణం జోక్యం చేసుకుని జనగణన ప్రశ్నావళిని సవరించాలి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం

హైదరాబాద్, జూలై 21: జనగణన--2027లో చేపట్టనున్న కులగణనలో ప్రతి గుర్తింపు పొందిన కులానికి "యూనిక్ నేషనల్ కాస్ట్ కోడ్ (ఖఅఅనబవ చీఛఅశీఅఖశ్రీ ఝుర్వ జశీంవ - ఖచీజజ)" కేటాయించకుండా కేవలం ఓపెన్-ఎండెడ్ విధానంలో కులాల వివరాలు నమోదు చేస్తే, మరోసారి బీసీలకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదం ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు, బీసీ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ గుజ్జ సత్యం హెచ్చరించారు.హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ చరిత్రలో తొలిసారిగా కులగణన చేపట్టడం స్వాగతించదగ్గ నిర్ణయమే అయినప్పటికీ, శాస్త్రీయ విధానాన్ని అనుసరించకపోతే ఈ చారిత్రాత్మక అవకాశమే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు.గతంలో 2011లో నిర్వహించిన సామాజిక-ఆర్థిక కుల సర్వే (రాజుజజ)లో ఒకే కులం అనేక పేర్లతో నమోదు కావడం, వేలాది ప్రాంతీయ పేర్లు, భాషా భేదాలు, స్పెల్లింగ్ తేడాల కారణంగా డేటా విశ్లేషణ క్లిష్టంగా మారిందని గుర్తు చేశారు. ఆ తప్పిదాల నుంచి కేంద్ర ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రస్తుతం జనగణన--2027కు సంబంధించి మొదటి దశ ప్రక్రియలు పూర్తికాగా, రెండో దశలో ప్రశ్నావళి పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రతి గుర్తింపు పొందిన కులానికి ముందుగానే యూనిక్ నేషనల్ కాస్ట్ కోడ్ కేటాయించి, అదే కోడ్ ఆధారంగా కుల వివరాలు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఎస్సీ, ఎస్టీ వర్గాలకు గుర్తింపు కోడ్‌లతో నమోదు జరుగుతున్నప్పుడు, బీసీలు సహా ఇతర కులాలను మాత్రం ఓపెన్-ఎండెడ్ విధానంలో నమోదు చేయడం శాస్త్రీయ పద్ధతి కాదని గుజ్జ సత్యం విమర్శించారు. ఒకే దేశంలో ఒకే జనగణనకు రెండు




వేర్వేరు ప్రమాణాలు ఉండకూడదన్నారు.

భారతదేశంలో ఒకే కులం వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు పేర్లు, స్థానిక ఉచ్చారణలు, భాషా రూపాల్లో ఉండటం సహజమని, యూనిక్ కోడ్ లేకుంటే ఒకే కులం అనేకసార్లు నమోదై వాస్తవ జనాభా గణాంకాలు వక్రీకరించే ప్రమాదం ఉందన్నారు.

అటువంటి తప్పిదాలు రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, బడ్జెట్ కేటాయింపులు, విద్యా మరియు ఉపాధి అవకాశాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సామాజిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో కోడ్ ఆధారిత విధానం అమలు చేయడం వల్ల గణాంకాలు మరింత క్రమబద్ధంగా నమోదు చేయగలిగారని, బీహార్ కుల సర్వే కూడా ఈ విషయంలో ఒక మంచి నమూనాగా నిలిచిందని పేర్కొన్నారు.

ఈ అనుభవాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఒకే విధమైన కోడింగ్ వ్యవస్థను అమలు చేయాలని కోరారు.ప్రస్తుతం రూపొందిస్తున్న జనగణన ప్రశ్నావళిని 2011 నమూనాకు పరిమితం చేయకుండా, ప్రస్తుత సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి పరిస్థితులకు అనుగుణంగా సవరించాలని గుజ్జ సత్యం సూచించారు. తుది ప్రశ్నావళిని ఖరారు చేసే ముందు బీసీ సంఘాలు, సామాజిక శాస్త్రవేత్తలు, గణాంక నిపుణులు, ప్రజా విధాన నిపుణులతో విస్తృత స్థాయిలో సంప్రదింపులు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు."ఖచ్చితమైన డేటా లేకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదు. శాస్త్రీయ కులగణన ద్వారానే దేశంలోని వెనుకబడిన వర్గాల వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తాయి.

జనగణన--2027ను చారిత్రాత్మక విజయంగా నిలబెట్టాలంటే యూనిక్ నేషనల్ కాస్ట్ కోడ్ అమలు తప్పనిసరి" అని గుజ్జ సత్యం స్పష్టం చేశారు.ఈ అంశంపై తాను ఇప్పటికే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర సామాజిక న్యాయ శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలేకు సమగ్ర వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి, జనగణన ప్రక్రియ ప్రారంభానికి ముందే దేశంలోని ప్రతి గుర్తింపు పొందిన కులానికి యూనిక్ నేషనల్ కాస్ట్ కోడ్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ మీడియా సమావేశంలో బీసీ నాయకులు శ్రీనివాస్, జిల్లా నరేందర్ తదితరులు పాల్గొని యూనిక్ నేషనల్ కాస్ట్ కోడ్ అమలుకు మద్దతు ప్రకటించారు.

# ప్రిన్సిపల్ దిలీప్ కుమార్ ను వెంటనే బదిలీ చేయాలి



హైదరాబాద్, జూలై 21: జనగామ జిల్లా కొడకండ్ల మండలంలోని తెలంగాణ రెసిడెన్షియల్ బాలికల స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ టి.దిలీప్ కుమార్ ను వెంటనే బదిలి చేయాలని కోరుతూ తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధులు తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీని కలిసి విజ్ఞప్తి చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో 2022లో రెసిడెన్షియల్ బాలికల స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ కి ప్రిన్సిపాల్ గా దిలీపుమార్ వచ్చారని, నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా అతన్ని ఇంతవరకు మార్చకపోవడం శోచనీయమని అన్నారు. బాలికల రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో ఉండవలసిన మహిళా ప్రిన్సిపల్ కు బదులుగా మేల్ ప్రిన్సిపల్ ఉండడంతో బాలికలు తమ భాధలను, వ్యక్తిగత సమస్యలను చెప్పుకోలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో ఉన్న మేల్ ఫ్యాకల్టీ, మేల్ ప్రిన్సిపల్ ను వెంటనే బదిలీ చేసి ఫిమేల్ ఫ్యాకల్టీతో పాటు ఫిమేల్ ప్రిన్సిపల్ ను నియమించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కళాశాలలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బాలికలకు తగిన రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాలిక రక్షణ, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రిన్సిపల్ తో పాటు మేల్ లెక్చరర్స్, టీచర్స్ ను బదిలి చేయాలని జిలుకర రవికుమార్ డిమాండ్ చేశారు.

# పచ్చని భవిష్యత్తు కోసం 'మాసివ్ ప్లాంటేషన్ డ్రైవ్'



హైదరాబాద్ ఎస్టేట్ 21 జులై 2026

భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఏక్ పేడ్ మా కే నామ్" పిలుపులో భాగంగా, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ మరియు కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ (జజూ) దిశానిర్దేశం మేరకు మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలో మంగళవారం "మాసివ్ ప్లాంటేషన్ డ్రైవ్" (బృహత్ వృక్షారోపణ కార్యక్రమం) అంగరంగ వైభవంగా జరిగింది. ఈ హరిత మహోత్సవాన్ని మందమర్రి ఏరియా నర్సరీ ప్రాంగణంలో ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ స్వయంగా మొక్క నాటి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ నల్ల బంగారాన్ని ఉత్పత్తి చేయడమే కాకుండా, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో సింగరేణి సంస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. బొగ్గు తవ్వకాలతో పాటు హరితాహార సంరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మేము కట్టుబడి ఉన్నాం అని పేర్కొన్నారు. ప్రతీ ఉద్యోగి ఏడాదికి కనీసం ఒక మొక్కను నాటడమే కాకుండా, దానిని ఒక బాధ్యతగా దత్తత తీసుకుని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మందమర్రి ఏరియాలోని నర్సరీలో 500 మొక్కలు నాటడం జరిగినది. ఈ బృహత్ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం,జి ఎల్ ప్రసాద్, ఎస్.కె ఏజెంట్ సంతోష్ కుమార్, కేకే ఏజెంట్ ఖాదిర్, ఐ ఈ డి (డి జి యం) కిరణ్ కుమార్, ఫారెస్ట్ అధికారి నవీన్, ఎన్విరాన్మెంట్ అధికారి వెంకట్ రెడ్డి, వివిధ విభాగాల అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు మరియు కార్మికులు విశేష సంఖ్యలో పాల్గొని, మొక్కలు నాటరు.

# పెద్దమ్మ గుడి--అండర్ బ్రిడ్జి రహదారికి మోక్షమెప్పుడు?

## శిథిలమైన రహదారితో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు..

## వెంటనే బీటీ రహదారి నిర్మించాలని బందెల రమేశ్ బాబు డిమాండ్



సంగెం, జూలై 21 హైదరాబాద్ ఎస్టేట్: సంగెం మండలం ఎల్గూర్ రంగంపేట గ్రామంలోని ముమ్మిడివరం--తిమ్మాపురం ప్రధాన రహదారిలో పెద్దమ్మ గుడి నుంచి అండర్ బ్రిడ్జి వరకు ఉన్న రహదారి శిథిలావస్థకు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సామాజిక కార్యకర్త బందెల రమేశ్ బాబు పేర్కొన్నారు. వర్షాకాలంలో రహదారి గుంతలతో నిండిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, వెంటనే నాణ్యమైన బీటీ రహదారి నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామస్తులు, రైతులు, కూలీలు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, వృద్ధులు ఈ మార్గంలో ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్నప్పటికీ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. వర్షం కురిసినప్పుడు గుంతలు నీటితో నిండిపోవడంతో రహదారి ఎక్కడ ఉందో, గుంత ఎక్కడ ఉందో గుర్తించడం కూడా కష్టంగా మారుతోందని తెలిపారు. దీంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, రాత్రి వేళల్లో ప్రయాణం మరింత క్లిష్టంగా మారుతోందని పేర్కొన్నారు. ఈ రహదారిపైనే రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లడం, పంటలను మార్కెట్‌కు తరలించడం, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు చేరుకోవడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు ప్రయాణించడం జరుగుతున్నప్పటికీ సమస్య పరిష్కారంలో జాప్యం కొనసాగుతోందని బందెల రమేశ్ బాబు విమర్శించారు. గ్రామ ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ, గ్రామ సర్పంచ్ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తదితర అధికారులు వెంటనే రహదారిని పరిశీలించి, పెద్దమ్మ గుడి నుంచి అండర్ బ్రిడ్జి వరకు నాణ్యమైన బీటీ రహదారి నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారంలో మరింత జాప్యం జరిగితే గ్రామ ప్రజలతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి జిల్లా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని బందెల రమేశ్ బాబు హెచ్చరించారు.

# ఎన్ ఆర్ జి ఎస్ నిధులతో సి సి రోడ్లను పని ప్రారంభించిన సర్పంచ్ పండుగ పద్మావతి బాల్రాజ్



హైదరాబాద్ ఎస్టేట్ యాచారం ప్రతినిధి రామాచారి జూలై 21
రంగారెడ్డి జిల్లా యాచారం మండలంధర్మన్నగూడ గ్రామంలో పండుగ పద్మావతి బాల్రాజ్ సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై గ్రామంలో ఎన్ ఆర్ జి ఎస్ నిధులు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి 20 లక్షల రూపాయలు విడుదల చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి గ్రామ ఉపసర్పంచ్ నాగరాజ్ వెంకటేష్ రవీందర్ సత్యనారాయణ స్వాతి సుధాకర్ ప్రేమలత మౌనిక సెక్రెటరీ లతా మరియు గ్రామ ప్రజల సమక్షంలో సిసి రోడ్డు పనులను ప్రారంభించడం జరిగింది ఇంకా మన ధర్మన్నగూడ గ్రామాన్నీ అన్ని విధాల డెవలప్ చేస్తానని సర్పంచ్ పండుగ పద్మావతి బాల్రాజ్ చెప్పడం జరిగింది

# ఎన్ ఆర్ హాస్పిటల్ వారి మెగా ఉచిత వైద్య శిభిరా నికి అనూహ్య స్పందన



సబ్బవరం మండలం మండలకేంద్రం లో దుర్గాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఎన్ ఆర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిభిరానికి అనూహ్య స్పందన లభించింది. పరిసర ప్రాంతాల ప్రజలు తరలివచ్చి వైద్యశిభిరంలో పరిక్షలు చేయించుకున్నారు. శిభిరంలో వైద్యులు 90మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితరీతిన మందులు అందజేశారు. ఈ సందర్బంగా డాక్టర్ వెంకట్ మాట్లాడుతూ అన్నిరకాల వ్యాదులకు వైద్యం చెయ్యడంతో పాటు మందులు అందజేయడం జరుగుతుందన్నారుమ్. ప్రధానంగా ఆర్థో పెడిక్ కు సంభందించి ప్రత్యేకంగా చూడటం జరుగుతుందన్నారు. శస్త్ర చికత్సలు అవసరమయినవారిని గుర్తించి అన్ని సౌకర్యాలు కల్పిస్తూ వారికి చికిత్స చెయ్యడం జరుగుతుందన్నారు.కార్యక్రమం లో సత్యానంద సార్,డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ పరమేశ్వరి ఆర్థోపెడిక్, డాక్టర్ పరమేశ్వర , జనర ల్ పిజిషయన్ డాక్టర్ వెంకట్,డాక్టర్ వెంకట, సి ఓ సి ఓ శ్రీనివాస్ , మార్కెటింగ్ మేనేజర్ శంకర్రావు, ప్రోగ్రం కో ఆర్డినేటర్ గొంప శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌లో తొలి స్థానమే లక్ష్యం

## - 24లోగా 100 శాతం ప్రక్రియ పూర్తి చేయాలి

## రాష్ట్రంలో నాలుగో స్థానంలో పరకాల

## కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి





హన్మకొండ, జులై 21 హైదరాబాద్ ఎస్టేట్: హనుమకొండ భవానీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం పరకాల నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ లెవల్ ఏజెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి నల్గొండ ఎమ్మెల్సీ, వరంగల్ పార్లమెంట్ ఎస్ఐఆర్ రాజకీయ ఇన్‌చార్జ్ శంకర్ నాయక్, వరంగల్ పార్లమెంట్ అబ్జర్వర్ నాసిర్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి అయూబ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎస్ఐఆర్ పురోగతిపై సమగ్రంగా సమీక్షించిన నాయకులు, ఇప్పటికే 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసిన బూత్ లెవల్ ఏజెంట్లను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో పరకాల నియోజకవర్గం నాలుగో స్థానంలో నిలవడం పార్టీ శ్రేణుల సమిష్టి కృషికి నిదర్శనమని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ నెల 24వ తేదీలోగా ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసి పరకాల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే తొలి స్థానంలో నిలపాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి బూత్‌లో ఓటరు ధృవీకరణ పారదర్శకంగా, నిబంధనల మేరకు జరగాలని, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా కార్యకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్యానికి ఓటరు జాబితానే పునాది అని పేర్కొంటూ, దానిని ఖచ్చితత్వంతో రూపొందించడంలో బూత్ లెవల్ ఏజెంట్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పార్టీ బలోపేతంలో కార్యకర్తల సేవలు అమూల్యమని, కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు, ప్రాధాన్యం తప్పకుండా లభిస్తుందని భరోసా ఇచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నాయకత్వం నుంచి బూత్ స్థాయి కార్యకర్త వరకు అందరూ సమన్వయంతో ఒకే బృందంగా పనిచేస్తుండటం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో చివరి వరకు కృషి చేస్తే పరకాల నియోజకవర్గం రాష్ట్రంలోనే తొలి స్థానంలో నిలవడం ఖాయమని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కౌలు రైతులకు వెంటనే గుర్తింపు కార్డులు ఇవ్వాలి

## - 2011 చట్టాన్ని అమలు చేసి అన్ని ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

## -ఎన్నికల హామీని వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి వరంగల్ జిల్లా కౌలు రైతుల డిమాండ్



వరంగల్, జులై 21 హైదరాబాద్ ఎస్టేట్: వరంగల్‌లోని రైతు సంఘం భవన్‌లో మంగళవారం తెలంగాణ కౌలు రైతుల గుర్తింపు సాధన కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కౌలు రైతుల సమావేశం, అనంతరం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు, హసన్‌పర్తి, దుగ్గొండి, గీసుకొండ, సంగెం, వర్ధన్నపేట మండలాలకు చెందిన కౌలు రైతులు, రైతు--ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకులు విస్సా కిరణ్ కుమార్, బి. కొండల్ రెడ్డి, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా నాయకులు, రైతు--ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణలో 36 శాతానికి పైగా రైతులు కౌలు సాగుపైనే ఆధారపడుతున్నప్పటికీ ప్రభుత్వ గుర్తింపు లేక సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు కార్డులు లేకపోవడంతో పంట రుణాలు, సబ్సిడీ ఎరువులు, రైతు బీమా, పంట నష్టపరిహారం, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించే అవకాశాన్ని కూడా కోల్పోతున్నారని పేర్కొన్నారు. 2011 భూ అధీకృత సాగుదారుల చట్టం ప్రకారం ప్రతి ఏడాది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆ చట్టాన్ని అమలు చేసి ప్రతి అర్హ కౌలు రైతుకు గుర్తింపు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రతి ప్రభుత్వ పథకానికి భూస్వామి ఓటీపీ ధృవీకరణ తప్పనిసరి కావడంతో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంట సీజన్ ప్రారంభానికి ముందే గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో 22 జిల్లాలు, 47 మండలాలు, 58 గ్రామాల్లో 1,816 మంది కౌలు రైతులను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలను నమోదు చేసినట్లు నాయకులు వెల్లడించారు. ఆ నివేదికను ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించామని, కౌలు రైతుల హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో బానోతు యాకోబ్, సంఘీ యాకయ్యతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కౌలు రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బల్కంపేట ఎల్లమ్మకు పట్టు వస్త్రాలు

## - మంత్రి కొండా సురేఖ, కూతురు సుస్మితా పటేల్‌తో ప్రత్యేక పూజలు

## - రాష్ట్ర సుభిక్షం, ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు





హైదరాబాద్, జూలై 21 హైదరాబాద్ ఎస్టేట్: హైదరాబాద్‌లోని ప్రసిద్ధ శ్రీ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణ మహోత్సవంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. కూతురు సుస్మితా పటేల్‌తో కలిసి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, రైతాంగ సుభిక్షం, తెలంగాణ సమగ్ర అభివృద్ధి కోసం అమ్మవారిని ప్రార్థించారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి కొండా సురేఖకు దేవాలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి తీర్థప్రసాదాలు, వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన కళ్యాణోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీతా రెడ్డితో కలిసి పాల్గొని బోనాల శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవంలో పాల్గొనడం ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. లక్షలాది మంది భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారిని దర్శించుకునేలా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, శివసత్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వరుణ యాగాలు, ప్రత్యేక పూజలు దైవానుగ్రహానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని మంత్రి అన్నారు. అమ్మవారి కటాక్షంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడం ఆనందదాయకమని, ఈ వర్షాలతో తెలంగాణ పాడిపంటలతో సస్యశ్యామలంగా మారి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ప్రార్థించినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయ వైభవాన్ని మరింత పెంపొందించేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
22 బుధవారం జూలై 2026

# వరి స్థానంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి

## – వర్షాభావ పరిస్థితులను ముందస్తుగా ఎదుర్కొనే కార్యాచరణ చేపట్టాలి

## – మంత్రి పొన్నం ప్రభాకర్




హనుమకొండ, జూలై 21 హైదరాబాద్ ఎస్టేట్: ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన వర్షాభావ పరిస్థితుల సమీక్షా సమావేశంలో ఆయన వ్యవసాయం, పశు సంవర్ధక శాఖలు, తాగునీటి నిర్వహణపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కల్పించి, తక్కువ నీటి అవసరమయ్యే లెమన్ గ్రాస్ వంటి అధిక ఆదాయాన్నిచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై రైతులకు శాస్త్రీయ సూచనలు అందించాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పశుసంవర్ధక రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు అందుబాటులో ఉన్న వనరులపై సమగ్ర నివేదికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. వర్షాభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే పైస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళిక, సమయానుకూల చర్యలు, అందుబాటులో ఉన్న వనరుల సమర్థ వినియోగంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడవచ్చని అన్నారు. రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేస్తే వర్షాభావ పరిస్థితులను సమర్థంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, దొంతి మాధవరెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కాటి వీరయ్య మృతి సీపీఎం పార్టీకి తీరని లోటు.

## - కడవరకు కమ్యూనిస్టు గా బ్రతికిన వీరయ్య.

## - సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి...





హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి ) మద్దిరాల మండల కేంద్రానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ కాటి వీరయ్య మరణం సిపిఎం పార్టీకి తీరని లోటని ఆయన తన కడవరకు కమ్యూనిస్టుగా బ్రతికాడని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. మద్దిరాల మండల కేంద్రానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు కాటి వీరయ్య ఈరోజు అనారోగ్యంతో మృతి చెందటంతో వారి పార్థివ దేహం పై ఎర్ర జెండా కప్పి జోహార్లు అర్పించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాలకు కేంద్రబిందువైన మద్దిరాలలో కాటి వీరయ్య ప్రజా సమస్యలపై కామ్రేడ్ భీమ్ రెడ్డి,మల్లు స్వరాజ్యముల అనుచర ఘనంగా ఉండి పని చేశాడని పేర్కొన్నారు. మద్దిరాల గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు కావాలని భూములు పంచాలని జరిగిన పోరాటంలో వీరయ్య పాల్గొన్నాడని అన్నారు. పూటకొక పార్టీలు మారుతున్న నేటి సమాజంలో వీరయ్య తను అమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు కమ్యూనిస్టుగా బ్రతికాడని అన్నారు. సిపిఎం పార్టీకి వీరయ్య చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. వీర కుమారుడు నాగరాజు తండ్రి బాటలోనే ప్రయాణిస్తూ పేదల సమస్యలపై తన గలంతో ప్రజలను చైతన్యం చేస్తూ పోరాటాలకు దిక్సూచిగా నిలుస్తున్నాడని అన్నారు. వీరయ్య మరణం పట్ల సిపిఎం పార్టీ జిల్లా కమిటీ తరపున వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్ రెడ్డి సిపిఎం మండల కార్యదర్శి పోలోజు సైదులు కళాకారులు ఉప్పల నాగార్జున, నాగలక్ష్మి వీరయ్య కుమారుడు నాగరాజుతో పాటు వారి బంధుమిత్రుడు దండె శ్రీనివాస్, బీస్ కృష్ణ, పగిండ్ల వెంకన్న (పోలీస్) పులుసు శ్రీనివాస్,పాక సోమాలింగం, మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# SIR పై రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి డాక్టర్ పిట్టా వరప్రసాద్




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కాకినాడ, జూలై 21:

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిపాదిత సర్ (SIR) -- మన కర్తవ్యం అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు మరియు జాతీయ కార్యదర్శి డాక్టర్ పిట్టా వరప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల సవరణ పేరుతో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకూడదని అన్నారు. ఓటరు నమోదు, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, రాజ్యాంగబద్ధంగా, రాజకీయ జోక్యం లేకుండా జరగాలని ఆయన డిమాండ్ చేశారు. సమాజంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, గిరిజనులు, మహిళలు మరియు ఇతర బలహీన వర్గాల ఓటు హక్కులను పరిరక్షించడం ఎన్నికల సంఘం మరియు ప్రభుత్వాల బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ప్రతి పౌరుడు తన ఓటు నమోదు, ఓటరు వివరాల పరిశీలనపై అప్రమత్తంగా ఉండాలని, యువత ప్రజాస్వామ్య పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.

“ఓటు హక్కు రాజ్యాంగం ప్రసాదించిన పవిత్రమైన హక్కు. దానిని పరిరక్షించడం ప్రతి భారతీయుడి బాధ్యత” అని డాక్టర్ పిట్టా వరప్రసాద్ అన్నారు.

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉన్న వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, న్యాయవాదులు, మేధావులు మరియు యువజన ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. చివరగా ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన పెంపొందించేందుకు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది.

# మెదడు ఆరోగ్యం పై చాలా శ్రద్ధ అవసరం !

## – నేడు ప్రపంచ మెదడు దినోత్సవం.

## – డా. దుర్గాప్రసాద్ రావు గన్నంరాజు ..



హైదరాబాద్ :జులై 21.

మన దేశంలో మెదడు సంబంధించిన వ్యాధులు విపరీతంగా పెరుగుతున్నాయి. వేగంగా పెరుగుతున్న న్యూరో రోగుల సంఖ్యకు అనుగుణంగా చికిత్స వనరులు అంతంత మాత్రమే ఉన్నాయి. చికిత్స వనరులు , సంరక్షణ లతో పాటు జీవనశైలి విధానంలో కూడా మార్పులు రావాలి. శరీరంలోని నాడి వ్యవస్థను నియంత్రించే ‘ కమాండ్ సెంటర్ ‘ మెదడు. మెదడు ఆరోగ్యం, నాడీ సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించడం ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం . బ్రెయిన్ స్ట్రోక్, అల్జీమర్స్, డిమెన్షియా , ఎపిలెప్సీ ( ఫిట్స్ ) మరియు బ్రెయిన్ ట్యూమర్ వంటి తీవ్రమైన మెదడు వ్యాధుల పట్ల ప్రజలలో అవగాహన పెరగాలి. మెదడు శరీరంలో అతి ముఖ్యమయిన భాగం అయినప్పటికీ మెదడు ఆరోగ్యం విషయంలో భారత దేశం లో శ్రద్ధ తక్కువ. అందుకే మెదడు కు ఏ వ్యాధి వచ్చినా తేలికగా తీసుకోకూడదు . ప్రపంచవ్యాప్తంగా నాడీ సంబంధిత వైద్య సేవలు అందరికీ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో 2026 సంవత్సరానికి , ప్రపంచ ఫెడరేషన్ ఆఫ్ న్యూరాలజీ “ మెదడు ఆరోగ్యం: అందరికీ అందుబాటులో ఉండాలి “ అనే థీమ్‌ను ఎంపిక చేశారు. ఎవరికైనా నిరంతరం వచ్చే తలనొప్పి , జ్ఞాపకశక్తి తగ్గడం , తల పరిమాణం పెరగడం , తలకు తగిలే గాయాలు , తలలో గందరగోళం లాంటి సమస్యలు ఉంటే వెంటనే డాక్టర్ ను సంప్రదించి సరైన చికిత్స తీసుకోవాలి.

మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజూ కనీసం 7-8 గంటలు ప్రశాంతంగా నిద్రపోవడం చాలా ముఖ్యం. పండ్లు, డ్రైఫ్రూట్స్, మరియు పోషకాలు కలిగిన సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి. ఒత్తిడికి దూరంగా ఉంటూ, ప్రతిరోజూ క్రమం తప్పకుండా శారీరక వ్యాయామాలు , ధ్యానం చేయాలని , హోమియోపతి వైద్యంలో న్యూరో జబ్బులకు సమర్థవంతమైన ఔషధాలు ఉన్నాయని సీనియర్ హోమియోపతి వైద్యుడు డా. జి. దుర్గాప్రసాద్ రావు తెలియజేస్తున్నారు....

# తహసిల్దార్ కార్యాలయం మద్దిరాల లోనే నిర్మించాలి..



హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల( ప్రతినిధి )

మండల కేంద్రంలో మద్దిరాల గ్రామ సర్పంచ్ రాంపాక నాగరాజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండల తహశీల్దార్ కార్యాలయ భవనం ఇతర ప్రాంతాల్లో నిర్మించే ప్రతిపాదన ప్రభుత్వం విరమించుకోవాలని కోరారుమండల కేంద్రంలో ప్రభుత్వ భూమి కలదు అని అన్నారు. అధికారులు ప్రతిపాదించే భూమి మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో , హైవే దగ్గర కలదు, అక్కడే కార్యాలయం నిర్మిస్తే ప్రజలకు ప్రమాదాలు జరుగును అని అన్నారు. మండల ప్రజల అభీష్టమేరకు తహసీల్దార్ కార్యాలయ భవనం మండల కేంద్రంలోనే నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు, ఈ విలేకరుల సమావేశంలో రామచంద్రాపురం మాజీ సర్పంచ్ వెలుగు వెంకన్న, మండల ప్రజలు సంగని రవీందర్, వడ్డాణం మధుసూదన్, మల్లాల నర్సయ్య, దీూ ముదిరాజ్, మల్లాల రాంమూర్తి, పగిండ్ల చంద్రయ్య, రాంపాక మురళి తదితరులు పాల్గొన్నారు

# రేషన్ కార్డుదారులు ఈ నెలలోనే ఈ-కేవైసీ పూర్తి చేయాలి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 21:- రంగారెడ్డి జిల్లాలోని రేషన్ కార్డుదారులు ఈ నెలాఖరులోగా తప్పనిసరిగా ఈ-కేవైసీ (వ-ఖ్జ) ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి వనజాత సూచించారు. రేషన్ కార్డుల ధ్రువీకరణ ప్రక్రియలో భాగంగా ఈ-కేవైసీ నిర్వహిస్తున్నామని, లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా తమ సమీప రేషన్ దుకాణానికి వెళ్లి బయోమెట్రిక్ ధ్రువీకరణ పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ-కేవైసీ సేవలు కేవలం ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో మాత్రమే అందుబాటులో ఉంటాయని, ఇందుకోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయలేదని స్పష్టం చేశారు. రేషన్ దుకాణాలకు స్వయంగా రాలేని వృద్ధులు, దివ్యాంగుల కోసం సంబంధిత సిబ్బంది వారి ఇళ్ల వద్దకే వెళ్లి ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపారు. అలాగే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు రేషన్ దుకాణాలకు ఎలాంటి సంబంధం లేదని, ఈ విషయంలో వస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. ప్రతి అర్హులైన రేషన్ కార్డుదారుడు నిర్ణీత గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిరంతరంగా పొందాలని జిల్లా పౌరసరఫరాల అధికారి విజ్ఞప్తి చేశారు.

# నర్సు అదృశ్యం.. పోలీసులకు తండ్రి ఫిర్యాదు

## విధులకు వెళ్లిన యువతి ఆచూకీ గల్లంతు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 21:- రంగారెడ్డి జిల్లా మన్నెగూడలోని మహోనియా ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నల్గొండ జిల్లా మల్లేపల్లి గ్రామానికి చెందిన అంధుగుల మనోహర్ (45) ఇచ్చిన ఫిర్యాదు మేరకు, తన పెద్ద కుమార్తె అంధుగుల వెన్నెల (24) గత మూడు నెలలుగా మన్నెగూడలోని మహోనియా ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ఈ నెల 13వ తేదీ ఉదయం విధులకు వెళ్లిన వెన్నెల, అదే రోజు సాయంత్రం మల్కాజిగిరిలోని బాబాయి ఇంటికి ఆధార్ కార్డు తీసుకురావడానికి వెళ్తున్నట్లు తండ్రికి తెలిపింది. అయితే జూలై 14 సాయంత్రం ఆస్పత్రి సిబ్బంది ఫోన్ చేసి వెన్నెల రాత్రి విధులకు హాజరుకాలేదని సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె మొబైల్‌కు పలుమార్లు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్‌గా వచ్చింది. అనంతరం బాబాయిని సంప్రదించగా వెన్నెల అక్కడికి రాలేదని తెలిపారు. కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో మనోహర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి యువతి ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# శ్రీకాంత్ ఆకస్మిక మృతికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నివాళి





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 21:-

మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు శ్రీకాంత్ ఆకస్మిక గుండెపోటుతో మృతిచెందడం పట్ల ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. శ్రీకాంత్ మరణం అత్యంత బాధాకరమైన విషయమని పేర్కొంటూ, ఆయన కుటుంబానికి ఇది తీరని లోటు అన్నారు. శ్రీకాంత్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం, మనోబలాన్ని ఆయన కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో శ్రీకాంత్ చూపిన అంకితభావం, నిబద్ధత, సేవాస్ఫూర్తి ఎప్పటికీ గుర్తుండిపోతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన లేని లోటు మిత్రులు, సహచరులు, కుటుంబ సభ్యులకు ఎప్పటికీ తీరనిదని అన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చివరగా “ఓం శాంతి శ్రీకాంత్” అంటూ ఆయన ఘన నివాళులర్పించారు.

# హనుమకొండలో మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే నాయిని స్వాగతం..

### జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి...



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతిదీ భాస్కర్ హనుమకొండ
ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షా సమావేశం నిమిత్తం హనుమకొండకు విచ్చేసిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు ఘన స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారి జన్మదినాన్ని పురస్కరించుకుని మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామ ఆలయ శాశ్వత అధ్యక్షుడిగా పాండ్రంగి



స్థానిక మెయిన్ రోడ్ చిన్న బజార్ వద్ద లో కొలువైన శ్రీ సీతారామ ఆలయం వద్ద ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షుడి 2గా కే నారాయణరావు మాస్టారు నియమించగా, ఆయన స్థానంలో సోమవారం ఆలయంల కమిటీ సమావేశమైలో శాశ్వత నూతనగా అధ్యక్షుడిగా పాండ్రంగి సత్యారావు ను ఆలయ కమిటీ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకొని ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో. ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షులు. కొణతాల జగన్నాధరావు నాయుడు, కార్యదర్శి సిరసపల్లి సూరిబాబు, కోశాధికారి. దాసిరెడ్డి వెంకటేశ్వరరావు. సతివాడ దుర్గారావు పై కార్యక్రమం ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల ఫిర్యాదుల స్వీకరణ76

### అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు



ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, వారికి భరోసా కల్పించడమే లక్ష్యంగా అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ఈరోజు ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మార్గదర్శకత్వంలో జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు బాధితుల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు.నేటి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 76 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో ప్రధానంగాభూ తగాదాలు మరియు ఆస్తి సంబంధిత సమస్యలు. భార్యాభర్తల మధ్య కలహాలు, వేధింపులు.మోసపూరిత వ్యవహారాలు, ఆర్థిక నేరాలు. ఇతర ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన అంశాలు.ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం అదనపు ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి కీలక సూచనలు చేశారు:ప్రతి ఫిర్యాదుపై 7 రోజుల్లోపు సమగ్ర విచారణ పూర్తి చేయాలి.ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా వాస్తవాల ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.బాధితులకు చేపట్టిన చర్యల గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి.
విచారణ అనంతరం తీసుకున్న చర్యల నివేదికను తప్పనిసరిగా జిల్లా కార్యాలయానికి సమర్పించాలి."ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన న్యాయం అందించడమే పోలీసు యంత్రాంగం ప్రధాన బాధ్యత. ప్రజా సమస్యల పరిష్కారంలో అనకాపల్లి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారు.ఈ కార్యక్రమంలో ఎస్పై బి.శ్రీనివాసరావు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆర్ ఇ సి ఎస్ లో పాలిటెక్నిక్ కౌన్సిలింగ్



కశింకోట ఆర్.ఈ.సి.ఎస్. పాలిటెక్నిక్ కళాశాలలో వినియోగధారుల కోటాలో అడ్మిషన్ కొరకు జరిగిన కౌన్సిలింగ్ లో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగలాలలో అన్ని అడ్మిషన్లు నింపబడ్డాయి అని, సివిల్ ఇంజనీరింగ్ విభాగం లో కొన్ని అడ్మిషన్లు ఖాళీ ఉన్నాయని, 120 సీట్లకు 102 సీట్లు పూరింపబడ్డాయి అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. ఉమా శంకర్ తెలియ చేశారు. ఈ కౌన్సిలింగ్ కు స్పెషల్ ఆఫీసర్ గా అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఐ వి ఎస్ ఎస్ శ్రీనివాసరావు , తనికీ అధికారులుగా లెక్చరర్లు సురేష్ మరియు రంగారాజ్ హాజరయ్యారు. కౌన్సిలింగ్ లో అసోసియేట్ ప్రిన్సిపాల్ కె. శివ, విభాగాధిపతులు గణేష్, రమణ కుమార్లు, ఆఫీస్ సూపరింటెండెంట్ కె. శివరాం, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐ సస్పెన్షన్‌తో నెక్కొండలో సంబరాలు

### – స్వీట్లు పంచి ఆనందం వ్యక్తం చేసిన స్థానికులు..
### – బాణాసంచా కాల్చి సంబరాలు..
### – సీపీ శ్వేతా రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



నెక్కొండ, జులై 21 హైదరాబాద్ ఎస్టేట్:
నెక్కొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ మహేందర్‌ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి జారీ చేసిన ఉత్తర్వుల నేపథ్యంలో నెక్కొండ మండల కేంద్రంలో కొందరు స్థానికులు సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పంచుకొని, బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం సీపీ శ్వేతా రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి ఆమె నిర్ణయాన్ని స్వాగతించారు. ఎస్ఐ మహేందర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై శాఖాపరంగా విచారణ చేపట్టిన అధికారులు, ప్రాథమికంగా ఆరోపణలకు ఆధారాలు ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థపై విశ్వాసం నిలబెట్టాలంటే ప్రతి అధికారి చట్టానికి లోబడి, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐ మహేందర్ విధుల నిర్వహణలో అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించడం, అమాయకులపై రౌడీషీట్లు నమోదు చేసి వేధింపులకు గురిచేయడం వంటి అంశాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైందని ఆరోపించారు. అవినీతి ఆరోపణలపై శాఖాపరంగా విచారణ నిర్వహించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం పోలీసు శాఖ పారదర్శకతకు నిదర్శనమని వారు అభిప్రాయపడ్డారు. ఇకపై నెక్కొండలో చట్టం ముందు అందరూ సమానులనే రాజ్యాంగ స్ఫూర్తిని కచ్చితంగా అమలు చేస్తూ, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా స్పందించి ప్రతి పౌరుడికి న్యాయం జరిగేలా పోలీసులు వ్యవహరించాలని కోరారు. అవినీతి ఆరోపణలపై శాఖాపరంగా విచారణ అనంతరం సస్పెన్షన్ చర్యలు తీసుకున్న వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డికి స్థానికులు అభినందనలు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే ఇటువంటి చర్యలు పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొంటూ మండల ప్రజల తరఫున ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎల్‌నీనో ప్రభావం నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాల సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే KR నాగరాజు గారు...




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హనుమకొండ
ఎల్‌నీనో ప్రభావం నేపథ్యంలో చేపట్టాల్సిన ముందస్తు కార్యాచరణ, కంటింజెన్సీ ప్రణాళికలు, వివిధ శాఖల సంసిద్ధతపై రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార ఉ పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ గార్ల అధ్యక్షతన మంగళవారం హనుమకొండ ఐడీఓసీ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు పాల్గొన్నారు.ఈ సమీక్ష సమావేశంలో పలు అధికారులకు సూచనలు చేశారు. వర్షాభావ పరిస్థితుల దృశ్య రైతులకు వ్యవసాయ శాఖ అధికాలతో సమన్వయం చేసుకొని పంటలపై అవగాహన కల్పించాలన్నారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులను గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు.నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నీటి సమస్యలపై మంత్రుల దృష్టికి తీసుకెళ్లి దేవాదుల ద్వారా నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషనర్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి,రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కడియం శ్రీహరి, దొంతి మాధవరెడ్డి, మురళీ నాయక్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికారి, రాష్ట్ర కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన
ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లు,
చాహత్ బాజ్‌పాయి, డా.సత్య శారద, హేమంత్ బొర్ఖడే సదాశివరావు, సందీప్ కుమార్ ఝా, రాహుల్ శర్మ, స్నేహ శబరీష్, ఆదనవు కలెక్టర్లు సంబంధిత శాఖల
ఉన్నతాధికారులు, కేవీకే--ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు అనకాపల్లి జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశాలు నిర్వహించకూడదు....

## జిల్లా కలెక్టర్ కు దాడి రత్నాకర్ వినతి



జిల్లా ఇన్చార్జి మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు మరియు ముఖ్య నాయకులు పాల్గొనే అనకాపల్లి జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశాలు అందరికీ అందుబాటులో ఉండే సమయంలోనే నిర్వహించాలని తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ కోరారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ , పార్లమెంటు రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ పాల్గొనే ఈ సమీక్ష సమావేశంను పార్లమెంటు సమావేశాలు మొదలయ్యే ఈరోజు జూలై 20వ తేదీన ఏర్పాటు చేయడం లేక కావాలని చేసినదో తెలియడం లేదని అన్నారు. పార్లమెంటు సమావేశాలు నిర్వహించే సమయంలో ఏర్పాటు చేయడం వలన అనకాపల్లి జిల్లా అభివృద్ధిపై పార్లమెంటు సభ్యులు తమ యొక్క అభిప్రాయాలను వెలిబుచ్చే అవకాశం లేకుండా పోతున్నదని అన్నారు. గతంలో కూడా ఏప్రిల్ నెలలో పార్లమెంటు సమావేశాలు ఆఖరు తేదీన సమావేశాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఒక జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం పార్లమెంటు సమావేశాలు, శాసనసభ సమావేశాలు జరుగుతున్నప్పుడు పెట్టకూడదు అని నిబంధన ఉన్నదని అధికారులు పట్టించుకోకుండా ప్రజాప్రతినిధులు అందుబాటులో లేని సమయంలో ఏర్పాటు చేయడం సరికాదని అన్నారు. కాబట్టి ఈ యొక్క సమావేశాన్ని అందరూ అందుబాటులో ఉండే సమయంలో మార్చి పెట్టవలసిందిగా జిల్లా కలెక్టర్ వారిని మరియు అధికారులను కోరారు.

# విశాఖ డైరీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి...

## టిడిపి మండల అధ్యక్షులు కెవిఎస్ నాయుడు (బాబి)





విశాఖ డైరీ అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి) అన్నారు. తుమ్మపాల పాల ఉత్పత్తిదారుల సంఘం2 నూతన అధ్యక్షునిగా ఆదివారం సిరిసాల నాగ సురేష్, అలాగే డైరెక్టర్ గా కనుబుడ్డి రామకోటి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాబి మాట్లాడుతూ విశాఖ డైరీ ద్వారా పాడి రైతులకు పాడిపశువులకు రుణాలతో పాటు అవసరమైన వారికి విద్య, వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. పాల సొసైటీ పరిధిలో ఉన్న రైతులందరూ విధిగా డైరీ కి కనీసం ఒక్కో రైతు లీటర్ చొప్పునైన సరఫరా చేయడం ద్వారా అభివృద్ధి చెందుతుందన్నారు. టిడిపి కన్వీనర్ ఆడారి గోవిందరావు మాస్టర్ మాట్లాడుతూ పాడి రైతులకు రైతు సంక్షేమ కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కార్యదర్శి నడిపల్లి బోసు బాబు, పాల సొసైటీ మాజీ అధ్యక్షులు పెద్ది శెట్టి బద్రినాథ్, డైరెక్టర్ మార్టూరు నాగరాజు, కనుబుడ్డి చిన్న, గొంతిన రాము, సూపర్వైజర్ ఏసుదాసు, పెయిడ్ సెక్రటరీ నిమ్మల అర్జున తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in

# సంతాపవార్త



స్వస్తిశ్రీ పరాభవ నామ సం॥ నిజజ్యేష్ఠ కృష్ణ పక్ష చతుర్థశి
తేది. 13-07-2026 సోమవారం ఉ॥ గం॥ 7-31 ని॥లకు
మా తండ్రి గారైన

## కీ॥ శే॥ దొంగరి ముట్టయ్య గారు

స్వర్గస్తులైనారని తెలుపుటకు చింతించుచున్నాము.
తేది. 23-07-2026 గురువారం పెద్దకర్మ, ఆశీర్వచనము
జరుపబడును. కావున తామంతా విచ్చేసి మా తండ్రి గారి
శాంతి చేకూర్చగలరని ప్రార్థన.

**ఇష్టబంతి :** మ॥ గం॥ 1-00 లకు

**కార్యస్థలం :**
మా స్వగృహంనందు,
గ్రా॥ దోసపహాడ్
మం॥ పెన్‌పహాడ్,
జి॥ సూర్యాపేట.
సెల్ : 8712540798,
9912346962.

**భర్య :**
దొంగరి గీతమణి

**కూతురు -అల్లుడు :**
కర్ణం సునిత -యాదగిరి

**ఇట్లు / కుమారులు - కోడళ్ళు :**
దొంగరి సురేందర్ - నజిత
దొంగరి సందీప్ - రేణుక

మనుమండ్లు, మనుమరాండ్లు

శ్రీ రేణు ప్రింటర్స్, సూర్యాపేట - 9553984799.

నిజం మా నిబద్ధత... ప్రజా ప్రయోజనం మా ధ్యేయం...
ది హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
ప్రతి ఇంటికి... ప్రతి చేతికి... నిజమైన వార్తలు
మా దినపత్రిక విస్తరణలో భాగంగా
రిపోర్టర్లు కావలెను!
జర్నలిజంపై ఆసక్తి కలిగిన, నిజాయితీ గల, సమాజంపై స్పందన కలిగిన అభ్యర్థులు మా బలమైన బృందంలో చేరండి.
- స్టాపర్లు (స్ట్రింగర్లు)
- మండల రిపోర్టర్లు
- జిల్లా బ్యూరోస్
అన్ని నియోజక వర్గాలలో కావలెను
సంప్రదించవలసిన నెంబర్: 9951693876
ఎడిటర్
లక్ష్మీనారాయణ

HYDERABAD ESTATE TV CHANNEL
HYDERABAD ESTATE TV CHANNEL
WANTED
STAFF REPORTERS, BURO CHIEFS & MANDAL REPORTERS
Hyderabad Estate TV Channel is inviting applications from enthusiastic and dedicated individuals for the following positions:
- STAFF REPORTERS
- BURO CHIEFS
- MANDAL REPORTERS
Interested candidates are requested to contact:
Editor: LAXMINARAYANA
9951693876
Join our team and be a part of professional journalism!

HYDERABAD ESTATE TV CHANNEL
VOICE OF HYDERABAD
TRUTH | TRUST | TRANSPARENCY
WE ARE RECRUITING!
JOIN OUR DYNAMIC TEAM
POSITIONS OPEN
STAFF REPORTERS — For News Coverage & Reporting
BURO CHIEFS — For Regional News Operations
MANDAL REPORTERS — For Local News & Updates
WE ARE LOOKING FOR
- Passionate about Journalism
- Good Communication Skills
- Commitment & Dedication
- Experience in Field Reporting is an Advantage
BE A PART OF A GROWING NEWS NETWORK
INTERESTED CANDIDATES PLEASE CONTACT
9951693876
EDITOR
LAXMINARAYANA
Let's Report. Let's Inform. Let's Make a Difference.